ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-04-2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.
2. రాష్ట్రాన్ని వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా మార్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు
3. ఎస్ఎల్బీసీ సొరంగంలో ప్రమాదం జరిగి 50 రోజులు పూర్తయినా ప్రభుత్వ సహాయక చర్యల్లో పురోగతి లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు.
4. రాష్ట్రంలో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం పసుపు హెచ్చరిక జారీ చేసింది.

.........................................

**బండి సంజయ్- గాప్ చలో**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. 80 కోట్ల మంది పేదలకు ఉచిత బియ్యం

అందిస్తుందన్నారు. రేషన్ షాపుల ద్వారా పేదలకు బియ్యం రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తున్నదని కాంగ్రెస్ నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ది పొంది దేశంలో దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటకు వచ్చారని తెలిపారు. బీజేపీ చేపట్టిన 'గావ్ చలో' కార్యక్రమంలో భాగంగా సంజయ్ కుమార్ ఈ ఉదయం కరీంనగర్ రూరల్ మండలంలోని జుబ్లినగర్ లో పర్యటించారు. ఊరంతా తిరిగి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించారు.

...........సంజయ్ బైట్..............

(పీటీసీ, కరీంనగర్)

**శ్రీధర్ బాబు**

తెలంగాణ  ప్రభుత్వం ఐటీ,ఫార్మా రంగాల్లో దేశంలోనే అగ్రపథాన నిలవడం ఆరంభం మాత్రమే అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. ఇప్పుడు రాష్ట్రాన్ని వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా మార్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు జూన్ 12 నుంచి 14 వరకు హైదరాబాద్ హైటెక్స్ లో నిర్వహించే **"ఫుడ్ ఎ ఫెయిర్" ప్రదర్శన** రెండో అంకె గోడ పత్రికను మంత్రి ఈ రోజు ఆవిష్కరించారు.  ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల ఏర్పాటు వంటి ప్రభుత్వ చర్యలు, ఆహార ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు, పరిశ్రమల అభివృద్ధికి పునాది వేస్తున్నాయని తెలిపారు. *ఈ రంగంలోని భవిష్యత్తు అవకాశాలను తెలుసుకునేందుకు, భాగస్వామ్యాలు ఏర్పరచుకునేందుకు 'ఫుడ్ ఎ ఫెయిర్' ఒక సమగ్ర వేదిక అవుతుందని చెప్పారు.* (డెస్క్)

**భూ భారతి-సీఎం**

రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు, లావాదేవీల సమాచారాన్ని రైతులకు, ప్రజలకు సులభంగా, వేగంగా అందించేందుకు రూపొందిన భూ భారతి పోర్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని రేపు ప్రారంభించనున్నారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ గా మూడు మండలాలను ఎంపిక చేసి, వాటిలో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సదస్సుల ద్వారా భూ భారతి పోర్టల్ గురించి రైతులు, ప్రజలకు సమగ్రంగా వివరించి, వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. (డెస్క్)

**వాతావరణం**

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. మరికొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, నారాయణ పేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఈ రోజు పసుపు హెచ్చరిక జారీ చేసింది. రాబోయే మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని తెలిపింది. (డెస్క్)

**యాదగిరిగుట్ట-భక్తులు**

యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో ఈ రోజు భక్తులు రద్దీ కొనసాగుతోంది. స్వామివారి దర్శనానికి 3గంటలకు పైగా సమయం పడుతోంది. ప్రత్యేక దర్శనానికి దాదాపు గంట సమయం పడుతోంది. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో భాస్కరరావు వెల్లడించారు.

(యాదాద్రి భువనగిరి)

**భద్రాచలం-బ్రహ్మోత్సవాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలు ముగియడంతో నేటి నుంచి స్వామివారి నిత్య కళ్యాణం యధాతధంగా జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. . ఉగాది రోజున ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున నిన్న పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

(భద్రాద్రి కొత్తగూడెం)

**ఇందిరమ్మ ఇళ్లు**

ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద మొదటి దశలో అత్యంత నిరుపేదలకు, అర్హులకు మాత్రమే గృహాలను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పథకం పారదర్శకంగా, నిరుపేదలకు న్యాయం చేసేలా అమలు కావాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లపై రెవెన్యూ, గ్రుహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో కలిసి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు

అత్యంత జాగ్రత్తగా పనిచేయాలని, కమిటీలు తయారు చేసిన అర్హుల జాబితాను తహశీల్దార్, ఎంపీడీవో, ఇంజినీర్‌లతో కూడిన మండల స్థాయి బృందం క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేసి, ధృవీకరించాలని సూచించారు.

(డెస్క్)

**సొరంగం-హరీశ్ రావు**

ఎస్ఎల్‌బీసీ సొరంగం సహాయక చర్యల్లో పురోగతి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ప్రమాదం జరిగి 50 రోజులు పూర్తయినా ప్రభుత్వ సహాయక చర్యల్లో పురోగతి లేకపోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం ఇద్దరి మృతదేహాలను వెలికి తీసి చేతులు దులుపుకుందని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. సహాయక బృందాలను సమన్వయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర ఆలస్యం చేసిందని పేర్కొన్నారు. సొరంగంలోపల చిక్కుకున్న ఆరుగురి పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. (డెస్క్)

**మెదక్ -డ్రగ్స్ నిర్మూలణ**

మెదక్ జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలణ అందరి సామాజిక బాధ్యత అని జిల్లా ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. మత్తు పదార్థాలతో యువత జీవితం నాశనం అవుతుందన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలణపై అవగాహణ కల్పించేందుకు రూపొందించిన గోడ పత్రికను ఎస్పీ విడుదల చేశారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు వినియోగించినా, రవాణా చేసినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

…………మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి బైట్ …………….

(మెదక్ జిల్లా పి టి సి)

**సిరిసిల్ల కలెక్టర్**

రైతులు తమకు ఉన్న నీటి వనరుల అంచనాతో పంటలు సాగు చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు . ఒకే పంటలు ఎప్పుడూ వేయకుండా మార్పిడి చేయాలన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెల లో వడగళ్ళ, అకాలవర్షాలతో రైతులు నష్టపోతున్నారని దీనిని నివారించేందుకు రైతులు 10 నుంచి 15 రోజుల ముందే సాగు పనులు మొదలుపెట్టాలని తెలిపారు. (పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా)

**ఆందోల్-దామోదర**

సంగారెడ్డి జిల్లా, ఆందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతున్నట్లు వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం నిన్న 200 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. త్వరలో పాఠశాల నిర్మాణ పనులు మొదలవుతాయన్నారు.

(SANGAREDDY. PTC )

**సిరిసిల్ల -కార్మికుల సమ్మె**

ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కారం, ప్రభుత్వం ఇచ్చిన హామీల కోసం గ్రామ పంచాయతీ కార్మికులు ఈనెల 19వ తేదీనుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు

సీఐటీయూ ఆల్ వర్కర్స్ యూనియన్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్స్ గణేష్ ప్రకటించారు. అధికారంలోకి వస్తే మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామమని, కనీస వేతనం 18 వేల రూపాయలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం అమలుచేయకపోవడంతోనే సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. (సిరిసిల్ల)

**వరంగల్ బీఆర్ఎస్ సభ- ఏర్పాట్లు**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు అనుమతి ఇస్తున్నట్టు వరంగల్ కమిషనరేట్ పోలీసులు ఒక ప్రకటనలో వెల్లడించారు. దాంతో సభకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతరావు తెలిపారు. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో నాలుగు చోట్ల వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

(వరంగల్ పీటీసీ)

**కేటీఆర్-గవర్నర్లు**

గవర్నర్లు నిర్ణయాలు తీసుకునే విషయంలో కాలపరిమితిని విధించిన సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్టు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారకరామారావు తెలిపారు. పాలనలో అడ్డంకులు సృష్టించేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు లెక్కలేనన్ని సార్లు గవర్నర్ పదవిని దుర్వినియోగం చేశాయని విమర్శించారు. శాసన సభాపతులతో రాజ్యాంగ దుర్వినియోగం విషయాన్ని కూడా సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. (డెస్క్)